సాక్షి అనంతపురం

మంగళవారం । 2 । జూలై । 2024



వారెవ్వా.. మెటా

వాట్సాప్‌లో కొత్తగా వచ్చిన ఫీచర్ మెటా ఆకట్టుకుంటోంది. ఏ సమాచారాన్నైనా క్షణాల్లో అందిస్తోంది.

8లో



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం

35.3°/23.6°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందజేసే ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించకుండా చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ గౌతమి శాలి అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ 114 ఫిర్యాదులు స్వీకరించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఎస్పీ సమస్యలను విని అక్కడిక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్. విజయభాస్కర్ రెడ్డి, జి. రామకృష్ణ, ఎస్బీ సీఐ ఇందిర పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



జేఎన్‌టీయూ రోడ్డులో సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. సోమవారం స్థానిక జేఎన్‌టీయూ రోడ్డులో ఎండీయూ వాహనం ద్వారా జరుగుతున్న బియ్యం, ఇతర సరుకుల పంపిణీని జేసీ పరిశీలించారు. తూకాలు సరిగా ఉన్నాయా, సరుకులు సక్రమంగా ఇస్తున్నారా అంటూ కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. వాహన నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోయినా, తూకాల్లో తేడాలొచ్చినా చర్యలు ఉంటాయన్నారు. ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తగా అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సరఫరాల అధికారి శోభరాణి ఉన్నారు.

టీబీ డ్యాంకు భారీగా వరద



బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శివమొగ్గ జిల్లా పరిధిలోని తుంగా (గాజనూరు) జలాశయం నుంచి విడుదల చేస్తున్న నీరంతా తుంగభద్ర జలాశయానికి చేరుతోంది. గత నెల 28న 879 క్యూసెక్కులు, 29న 1,818 క్యూసెక్కులు, 30న 6,308 కూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం ఉదయానికి 11,854 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 1,633 అడుగులకు నీటి మట్టానికి గాను 1,584.15 అడుగులకు నీరు చేరింది. డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 6.782 టీఎంసీల నీరు ఉంది. అవుట్‌ఫ్లో 296 క్యూసెక్కులుగా నమోదవుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆగస్టు 15 నాటికి జలాశయం పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో హెచ్చెల్సీ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: నేరాల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా జైలు సూపరింటెండెంట్ రహమాన్ తెలిపారు. నేరాలకు సంబంధించిన కొత్త చట్టాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రెడ్డిపల్లిలోని జిల్లా జైలులో జైలు సిబ్బందికి, అధికారులకు సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ చట్టాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు మాట్లాడుతూ.. కొత్త చట్టాలకు సంబంధించిన పలు అంశాలపై అనుమానాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ నల్లప్ప, లీగల్ ఎయిడెడ్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ పెద్దన్న, అసిస్టెంట్ లీగల్ ఎయిడెడ్ కౌన్సిల్ అరుణ్‌చైతన్య, జైలర్లు వసంతకుమార్, నాగరాజు, అచ్చెన్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పడిగాపుల పింఛన్..!

- పనులు మానుకుని వృద్ధులు, వితంతువులు ఎదురుచూపులు
- డబ్బు అందదేమోననే భయంతో సచివాలయాల వద్దకు పరుగులు
- పెత్తనం చెలాయించేందుకు టీడీపీ నేతల పోటీ
- అనంతపురంలో ఇరువర్గాల బాహాబాహీ
- రాజకీయ కార్యక్రమంలా 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ



పామిడిలో పింఛన్ డబ్బు కోసం ఒకచోట వేచి ఉన్న లబ్ధిదారులు

అనంతపురం క్రైం: గతంలో ఉదయం 7 గంటల్లోపే అందే పింఛన్ కోసం నేడు సాయంత్రం దాకా ఎదురు చూడాల్సి వచ్చింది. ఒకప్పుడు ఎక్కడుంటే అక్కడికే వచ్చి పింఛన్ డబ్బు అందజేసే వలంటీర్ నేడు లేకపోవడంతో.. పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించింది. కూలి పనులనూ వదిలేసుకోవాల్సి వచ్చింది. సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మొదటి రోజే పింఛన్‌దారులకు టెన్షన్ పెట్టింది. పెన్షన్ డబ్బు తమకందుతుందో లేదోనన్న భయంతో పలు చోట్ల లబ్ధిదారులు సచివాలయాల వద్దకు క్యూ కట్టారు.

రాజకీయ రంగు..

సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం రాజకీయ రంగు పులుముకుంది. ప్రభుత్వ పథకానికి టీడీపీ నేతలు రాజకీయ రంగులద్దారు. పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నించడంతో పలు చోట్ల వారి మధ్యనే విభేదాలు పొడచూపాయి. ఎవరికి వారుగా విడిపోయి పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. వీళ్లు మా వాళ్లు.. వీరికే ముందు డబ్బు ఇవ్వాలంటూ పలు చోట్ల సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో మిగిలిన వారు పింఛన్ ఇచ్చేదాకా వేచి చూడాల్సి వచ్చింది. యాడికి మండలం వెంగన్నపల్లె, పుప్పాల గ్రామాల్లో ఏకంగా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు పింఛన్లు ఇవ్వకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారు.

ఒకరిపై ఒకరు దాడులు

అనంతపురం నగరంలోని లక్ష్మీనగర్‌లో తమను కాదని ఎలా పింఛన్లు పంపిణీ చేస్తారని ఓ వర్గాన్ని మరో వర్గం నిలదీయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పరస్పరం దాడులు చేసుకున్నారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలతో భయంభయం

పెన్షన్ల పంపిణీ మొదటి రోజే అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలతో పెన్షన్‌దారుల్లో భయం నెలకొంది. అనంతపురంలోని పాతూరు వీరబ్రహ్మేంద్ర ఆలయం వద్ద నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. అనర్హులను గుర్తించి తొలగిస్తామని చెప్పారు. ఏకంగా ఎమ్మెల్యేనే అలా అనడంతో పింఛన్‌దారుల్లో ఆందోళన నెలకొంది. పింఛన్లు ఇవ్వలేక అప్పుడే పరోక్షంగా ఇలా తొలగిస్తామని అంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ ఇకపైన సరిగా అందుతుందో లేదో అంటూ వాపోయారు.

85 శాతం పింఛన్ల పంపిణీ

సోమవారం సాయంత్రానికి జిల్లాలో 85 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. పెంచిన పింఛన్ డబ్బుతో కలిపి జిల్లా వ్యాప్తంగా 2,89,508 మంది లబ్ధిదారులకు రూ.126.817 కోట్లు అందజేసేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మాది చేతల ప్రభుత్వం



ఉరవకొండలో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందిస్తున్న మంత్రి కేశవ్, కలెక్టర్

ఉరవకొండ: తమది చేతల ప్రభుత్వమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం ఉరవకొండ పట్టణంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ హితం కోరే నాయకులు, అధికారులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారన్నారు. రూ. 3 వేల పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచి మూడు నెలల బకాయిలతో కలిపి మొత్తం రూ. 7 వేలు ఇస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మొదటి రోజే వంద శాతం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం, నెల్లూరు తరువాత జిల్లాలోనే ఎక్కువ మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

- డ్రైవర్ మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన సోహైల్ (ఫైల్)

తనకల్లు: రహదారి పక్కనే ఉన్న ఇంట్లోకి లారీ దూసుకెళ్లిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన సోహైల్ (23) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున కదిరి వైపు నుంచి బి.కొత్తకోటకు లారీని డ్రైవ్ చేస్తూ బయలుదేరిన సోహైల్... తనకల్లు మండలం పరాకువాండ్లపల్లికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని రోడ్డు పక్కనే ఇంట్లోకి దూసుకెళ్లాడు. గది పూర్తిగా ధ్వంసమైంది. శిథిలాల కింద చిక్కుకున్న సోహైల్‌ను స్థానికులు కాపాడి వెంటనే కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. కాగా, లారీ దూసుకెళ్లడంతో సలీం అనే వ్యక్తికి చెందిన ఇంటి గది పూర్తిగా ధ్వంసమైంది. ఇంటి ముందు గదిలో ఓ హోటల్‌ను ఆయన నిర్వహిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున హోటల్‌లో పనిచేసుకుంటున్న సలీం.. ప్రమాదాన్ని గుర్తించగానే త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తనకల్లు ఎస్ఐ ధరణిబాబు తెలిపారు.

ఆకాశం వైపు ఆశగా...

- పదును వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపు
- ప్రభావం చూపని నైరుతి.. 18 రోజులుగా నేలరాలని చినుకు
- ముందస్తు వర్షాల వల్ల జూన్‌లో సాధారణం కన్నా అధికం
- 61 మి.మీ గానూ 147.7 మి.మీ నమోదైనా రైతన్నకు నిరాశే
- ఈనెల 15 వరకు ఖరీఫ్ సాగుకు సమయం ఉందంటున్న అధికారులు



అనంతపురం అగ్రికల్చర్: ఆశల 'నైరుతి' జూన్ 2నే జిల్లాను పలకరించింది. రుతుపవనాలు విస్తరించాయి. వర్షాలు కూడా బాగానే కురిశాయి. సకాలంలోనే పంటలు విత్తుకుంటామని అన్నదాత గంపెడాశతో సేద్యానికి దిగాడు. ఇదంతా జూన్ 15 వరకు మాత్రమే. ఆ తర్వాత వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారాయి. అధికారులు వర్షసూచన ఉన్నట్లు చెబుతున్నా, రోజూ మేఘాలు కూడా ఊరిస్తున్నా, వరుణుడు కరుణించడం లేదు. 10 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో గాలులు కూడా వీస్తున్నాయి. తుంపర్లు మినహా పదును వర్షం నమోదు కాలేదు. ముందస్తుగా వేసిన పంటలు గాలులు, ఎండకు వాడుతున్నాయి. అదనులో వేస్తామని భావించిన రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

అధిక వర్షపాతం నమోదైనా నిరాశే..

జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా నెల ముగిసేనాటికి 147.7 మి.మీ వర్షం కురిసింది. అంటే సాధారణం కన్నా ఏకంగా 142.1 శాతం అధికంగా నమోదైనా రైతులకు నిరాశ తప్పడం లేదు. జూన్ 15 నుంచి జూలై 15 వరకు ఖరీఫ్ పంటల సాగుకు సరైన సమయమని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో అదనులో విత్తుకుందామని ఆశగా ఉన్న రైతులకు జూన్ 15 తర్వాత చినుకు పడలేదు. జూన్ 1 నుంచి జూన్ 13వ తేదీ వరకు విస్తారంగా వర్షాలు పడ్డాయి. ఈనెల మొదటి 15 రోజుల్లోనే 143 మి.మీకు పైగా వర్షం కురిసింది. ఆ తర్వాత 15 రోజుల్లో కేవలం నాలుగంటే నాలుగు మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపడంతో ఈనెల 15వ తేదీ వరకు 11 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదు కావడం గమనార్హం. తీరా అదునులో పంటలు విత్తుకుందామని ఆశగా ఉన్న రైతులకు వరుణుడు మొహం చాటేశాడు. అయితే ఇంకా 15 రోజులు సమయం ఉన్నందున ఓ పదును వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఈనెల 15 వరకు విత్తుకు మంచి సమయంగానూ, వర్షాలు ఇంకా ఆలస్యమైనా ఈ నెలాఖరు వరకు విత్తుకోవచ్చని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నందున సాగుపై రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా 5 శాతమే..

ఈ ఖరీఫ్‌లో జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లుగా అంచనా వేశారు. అందులో ప్రధాన పంటలు వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్నతో పాటు ఇతర చిరుధాన్యాలు, పప్పుధాన్యపు పంటలు తదితర 15 రకాల పంటలు సాగులోకి రావాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు కేవలం 5 శాతం అంటే 17 వేల హెక్టార్లలో పంటలు వేసినట్లు వ్యవసాయశాఖ నివేదిక చెబుతోంది. సాధారణంగా గతంలో ఈ సమయానికి 50 వేల హెక్టార్లకు మించి పంటలు వేసినట్లు చెబుతున్నారు. జూన్ 13 తర్వాత గత 18 రోజులుగా ఎక్కడా సరైన వర్షం లేకపోవడంతో సాగు ఆగిపోయింది. ఈనెల 6న ఆరుద్ర కార్తె ముగుస్తుంది. 6 నుంచి 20 వరకు పునర్వసు కార్తె ఉంటుంది. ఆ లోపు విత్తు పడితేనే అంతో ఇంతో పంట చేతికొస్తుందని రైతుల్లో నమ్మకం. జూన్ నెలలో దాదాపు అన్ని మండలాల్లోనూ సాధారణం కన్నా అధికంగా వర్షాలు పడినా ఖరీఫ్ కదలిక లేకపోవడం విశేషం. ఇపుడు మంచి అదును కావడంతో పదును వర్షం పడాలని రైతులు కోరుకుంటున్నారు. జూలై నెల సాధారణ వర్షపాతం 63.9 మి.మీ నమోదు కావాలి.

పక్కా ప్రణాళికతో మొక్కల పెంపకం



సపోటా



నిమ్మ

- కార్యాలయాలు, విద్యాసంస్థలు, వసతి గృహాల్లో అవసరమైన మొక్కల ఎంపిక
- వివిధ రకాల పండ్లు, నిమ్మ, మునగ, కరివేపాకు మొక్కలకు ప్రాధాన్యత
- గుర్తించిన ప్రాంతాల్లోనే వాటిని నాటేలా కార్యాచరణ

అనంతపురం అర్బన్: జిల్లాను హరిత అనంతగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికతో పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని జిల్లా యంత్రాంగం చేపట్టింది. ప్రస్తుత వర్షాకాలంలో జిల్లావ్యాప్తంగా 42 జాతులకు చెందిన లక్ష మొక్కలు నాటాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. మొక్కలు నాటే విషయంలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మొక్క నాటే ప్రదేశం.. భవిష్యత్తులో ఆ మొక్క పెరిగి చెట్టుగా మారి అక్కడి వారికి ఉపయోగ పడే అంశాలను దృష్టిలో ఉంచుకున్నారు. ఈ మేరకు పండ్ల జాతులకు చెందిన జామ, సపోటా, సీతాఫలం, నేరేడు, మామిడి, బాదాం, ఉసిరి మొక్కలను నాటేందుకు ఎంపిక చేశారు. అలాగే కూరజాతికి చెందిన మునగ, నిమ్మ, కరివేపాకు మొక్కలనూ ఎంపిక చేశారు. ఈ మొక్కలు పెరిగి చెట్లయిన తరువాత వాటి ఫలాలను అక్కడి విద్యార్థులు, ప్రజలు అనుభవించేలా కార్యాచరణను రూపొందించారు.

మొక్కల ఎంపిక ఇలా...

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ, దాని పరిధిలోని 2,306 అంగన్‌వాడీ కేంద్రాల్లో నేరేడు, జామ, సపోటా, మునగ, బాదాం, సీతాఫలం, మామిడి జాతులకు చెందిన 2,342 మొక్కలు నాటాలని నిర్ణయించారు.
- బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని 37 వసతి గృహాల్లో నేరేడు, జామ, సపోటా, మునగ, నిమ్మ, కరివేపాకు, అశోక, వేప, కానుగ, టేకు జాతులకు చెందిన 302 మొక్కలు నాటనున్నారు.
- విద్యాశాఖ పరిధిలోని 1,741 స్కూళ్లలో మామిడి, వేప, కానుగ జాతులకు చెందిన 18 వేల మొక్కలు నాటాలని నిశ్చయించారు.
- 31 తహసీల్దారు కార్యాలయాల్లో వేప, కానుగ, నేరేడు, జామ జాతులకు చెందిన 811 మొక్కలు నాటాలని నిర్దేశించారు.
- ఆరోగ్యశాఖ పరిధిలోని 50 ఆస్పత్రుల్లో నేరేడు, జామ, సపోటా, మునగ, బాదాం, సీతాఫలం, మామిడి, రావి, ఉసిరి, నీలగిరి, టేకు, గులాబీ, మందార జాతులకు చెందిన 2,399 మొక్కలు నాటాలని నిర్ణయించారు.

పర్యావరణంతో పాటు ఆరోగ్యం

మొక్కల పెంపకం అనేది భావితరాలకు ప్రయోజనం చేకూరేలా ఉండాలి. ఇది ఒక్క పర్యావరణ పరిరక్షణ రూపంలోనే కాకుండా ఇతర రూపాల్లోనూ ఫలితాలు ఉండాలి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రధానంగా సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పండ్ల జాతి, కూర జాతి మొక్కల పెంపకానికి ప్రాధాన్యతినిచ్చాం. ఇక విద్యాసంస్థలు, తహసీల్దారు కార్యాలయాల్లో పండ్ల జాతి మొక్కలతో పాటు ఉసిరి, వేప, కానుగ, నీలగిరి వంటి ఔషధ గుణాలున్న మొక్కలను నాటిస్తున్నాం.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

అనుమానాస్పద స్థితిలో విద్యుత్ శాఖ ఉద్యోగి మృతి



అంజనేయులు (ఫైల్)

గుంతకల్లు టౌన్: పట్టణంలోని విద్యుత్‌శాఖ ఏఏఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న దాసరి ఆంజనేయులు (37) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపిన మేరకు.. రామిరెడ్డి కాలనీలో నివాసముంటున్న అంజనేయులుకు భార్య కావేరి, ఇద్దరు పిల్లలున్నారు. శనివారం రాత్రి గ్యాస్ట్రిక్ సమస్య తీవ్రంగా ఉందని భార్యతో చెప్పి పడుకున్నాడు. ఆదివారం ఉదయం ఎంతసేపటికీ నిద్రలేవలేదు. దీంతో తన భర్త గుండెపోటుతో మృతి చెందాడంటూ విషయాన్ని కావేరి తమ బంధువులందరికీ చేరవేసింది. అనుమానం కలిగిన బంధువులు ఆంజనేయులు మృతదేహాన్ని ఖననం చేయకుండా వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు గాదిలింగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. పోస్ట్‌మార్టం నివేదిక అందిన తరువాత పూర్తి వివరాలు తెలియజేస్తామని సీఐ పేర్కొన్నారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ప్రజల నుంచి అందే అర్జీలు గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. ఈ క్రమంలో ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యం చూపకూడదని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్‌తో పాటు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, శిరీష, డీసీఓ మురళీకృష్ణ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 343 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ప్రత్యేక శ్రద్ధ వహించి, గడువులోగా పరిష్కరించాలని చెప్పారు.

వినతుల్లో కొన్ని...

- నిషేధిత భూముల (చుక్కల భూమి) జాబితాలో చేర్చిన తమ భూమిని తొలగించాలని ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన మధుసూదన్‌రెడ్డి విన్నవించారు. సర్వే నంబరు 669లోని 16.80 ఎకరాల భూమిని చుక్కల భూమిగా చూపారన్నారు. తమ ఆవేదనను గుర్తించి వెంటనే తమ భూమిని చుక్కల జాబితా నుంచి తొలగించాలని కోరారు.
- తనకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి మంజూరు కాలేదని కుందుర్పి మండలం అపిలేపల్లికి చెందిన ఎస్.చంద్ర విన్నవించారు. సర్వే నంబరు 272–3లో తమకు 2.50 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమికి పీఎం కిసాన్ సమాన్ నిధి రెండేళ్లుగా రావడం లేదని చెప్పారు. వ్యవసాయ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. డబ్బులు మంజూరు చేయించి ఆదుకోవాలని కోరారు.
- ఇటుకలపల్లిలోని తమ భూమికి ఎన్‌ఓసీ మంజూరు చేయాలని అనంతపురం పట్టణం అరవిందనగర్‌లో నివాసముంటున్న కె.బి.పెద్దన్న విజ్ఞప్తి చేశారు. ఇటుకలపల్లి గ్రామ పొలం సర్వే నంబరు 27–2లో 3.30 ఎకరాల భూమి 40 ఏళ్లుగా తమ అనుభవంలో ఉందని చెప్పారు. భూమికి ఎన్‌ఓసీ ఇవ్వాలంటూ గత ఏడాది జనవరిలో దరఖాస్తు చేసుకున్నానన్నారు. తన కుమార్తెలకు దాన విక్రయం కింద ఇవ్వాలని నిర్ణయించుకున్నానన్నారు. భూమి ఎన్‌ఓసీ త్వరగా మంజూరు చేయాలని కోరారు.

క్లుప్తంగా

మీ సేవలు చిరస్మరణీయం : ఎస్పీ



డీఎస్పీ ఆంథోనప్పను సన్మానిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

అనంతపురం: ఏ ఉద్యోగికైనా ఉద్యోగ విరమణ అనివార్యమని, అయితే విధుల నిర్వహణలో అందజేసిన సేవలు ఎన్నటికీ చిరస్మరణీయంగా ఉంటాయని ఎస్పీ గౌతమిశాలి అన్నారు. జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన ఓ డీఎస్పీ, ఆరుగురు ఎస్‌ఐలు, 13 మంది సిబ్బందిని అనంతపురంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందాక వచ్చే పెన్షన్, తదితర ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సన్మానం అందుకున్న వారిలో డీఎస్పీ ఎం.ఆంథోనప్ప, ఎస్‌ఐలు రఫీక్ సాహెబ్, బలరామ రావు, తిప్పయ్య నాయక్, వెంకటలక్ష్మమ్మ, చంద్రశేఖర్, సులోచన, ఏఎస్‌ఐలు పద్మావతి, ఎర్రిస్వామి, దేవదాస్, మారెప్ప, ఎండీ దావూద్, హెడ్ కానిస్టేబుల్ అల్లీపీరా సాహెబ్ ఉన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కరరెడ్డి, జి.రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ మునిరాజ, ఎస్‌బీ సీఐ ఇందిర, ఆర్‌ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, ఆర్‌ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకరరెడ్డి, గాండ్ల హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో యువకుడి మృతి



సుబ్బయ్య (ఫైల్)

పుట్లూరు: మండలంలోని కడవకల్లుకు చెందిన సుబ్బయ్య (28) పాము కాటుతో మృతి చెందాడు. ఆదివారం రాత్రి బహిర్భూమికి గ్రామ సమీపంలోని అరటి తోట వద్దకు వెళ్లిన సమయంలో విషసర్పం కాటు వేసింది. విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.

గొర్రెకు 'సిజేరియన్'



శస్త్ర చికిత్స చేస్తున్న శింగనమల వెటర్నరీ సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభం

శింగనమల: శింగనమలలో కాపరి బాలకృష్ణకు చెందిన ఓ గొర్రెకు సోమవారం సిజేరియన్ శస్త్ర చికిత్స చేసి, గొర్రె పిల్లను బయటకు తీశారు శింగనమల వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్.పద్మనాభం . గొర్రె ఈనలేక ఇబ్బంది పడుతుండడంతో గత నెల 28న శింగనమల పశువైద్యశాలకు తీసుకువచ్చారు. గొర్రెను పరీక్షించిన డాక్టర్.. కడుపులోనే పిల్ల చనిపోయి ఉంటుందని గొర్రెకు సిజేరియన్ శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. మందులు ద్వారా ప్రయత్నించాలని గొర్రెల కాపరి కోరడంతో, మందులు పెట్టారు. ఫలితం లేకపోవడంతో సోమవారం సిజేరియన్ శస్త్ర చికిత్స చేసి, గొర్రె పిల్లను బయటకు తీశారు. గొర్రెకు కుట్లు వేసి రైతు వెంట ఇంటికి పంపారు. శస్త్ర చికిత్సలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

వారెవ్వా.. మెటా!

- వాట్సాప్‌లో కన్పిస్తున్న కొత్త ఫీచర్
- ఏ సమాచారం కావాలన్నా క్షణాల్లోనే పొందే వెసులుబాటు
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో 'మెటా' దూకుడు

కదిరి: సాంకేతిక దూకుడు పెరిగిన నేటి రోజుల్లో దాదాపు అన్ని రంగాల్లో కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) వినియోగం అనివార్యంగా మారింది. ఈ–కామర్స్ మొదలు సోషల్ మీడియా వరకూ అన్ని రంగాలు ఏఐని ఉపయోగిస్తున్నాయి. ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురాగా. తాజాగా ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సైతం అదే దూకుడును ప్రదర్శిస్తోంది. ఎక్కువ మంది ఉపయోగిస్తున్న మెసేజింగ్ యాప్ 'వాట్సాప్' తాజాగా ఏఐ రంగంలోకి కూడా అడుగు పెట్టింది. ప్రస్తుతం ఏఐ టెక్నాలజీకి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో 'మెటా' కూడా ఆ దిశగా అడుగులు వేసింది. ఇందులో భాగంగా 'మెటా ఏఐ' పేరుతో కొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. వారం రోజులుగా ఇప్పుడు వాట్సాప్ ఓపెన్ చేయగానే చాలా మంది స్మార్ట్ ఫోన్లలో రౌండ్‌షేప్‌లో ఓ సింబల్ కన్పిస్తోంది. అదే మెటా ఏఐ!



క్షణాల్లోనే కోరిన సమాచారం

మెటా తీసుకొచ్చిన ఈ కొత్త ఫీచర్ అచ్చం చాట్ జీపీటీలా పని చేస్తుంది. వాట్సాప్ ఓపెన్ చేయగానే మీ సెల్‌ఫోన్‌లో కన్పించే రౌండ్ సింబల్‌ను క్లిక్ చేసిన తర్వాత టర్మ్స్ అండ్ కండీషన్స్ యాక్సెప్ట్ చేయగానే 'మెటా ఏఐ విత్ లామా' అనే చాటింగ్ పేజీ ఓపెన్ అవుతుంది. మీ ఫ్రెండ్ లేదా ఇంకెవరితోనైనా ఎలాగైతే చాట్ చేస్తామో అలాగే మెటా ఏఐ ద్వారా కూడా చాట్ చేయచ్చు. మీకు ఏ సమాచారం కావాలన్నా అందులో టైప్ చేసి సెండ్ చేయగానే క్షణాల వ్యవధిలోనే మీరు కోరిన సమాచారం లభిస్తుంది. ఉదాహరణకు అనంతపురంలో లేదా కదిరిలో మీకు బెస్ట్ లాడ్జి ఏది? అని అడిగితే వెంటనే అందుకు సంబంధించిన లిస్ట్ ప్రత్యక్షమవుతుంది. తిరుమలలో అద్దె గది పొందడం ఎలా అని అడిగితే సమాచారం వస్తుంది. అలాగే మీకు ఇంకేదైనా ఫొటో కావాలన్నా క్షణాల్లో అందిస్తుంది. తాజాగా రిలీజ్ అయినా సినిమా వివరాలు కావాలన్నా తెలుసుకోవచ్చు. 'ఇమాజిన్ కార్ రేస్ ఆన్ మార్స్' అని టైప్ చేసినా కూడా వెంటనే మార్స్‌పై నిజంగా కార్ రేస్ జరిగితే ఎలా ఉంటుందో ఆ ఫొటో మీకు అందిస్తుంది. విద్య మొదలు వైద్యం వరకూ, టెక్నాలజీ నుంచి సైన్స్ వరకూ ఇలా అన్ని రకాల ప్రశ్నలకు మెటా ఏఐ మనకు సమాధానాలిస్తుంది. ఇండియా ప్రస్తుత ప్రధాని ఎవరు? అలాగే ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి ఎవరు? అనే ప్రశ్నలు అడిగినా తాజా సమాచారం మనకు 'మెటా ఏఐ' అందిస్తుంది. అయితే ప్రస్తుతం ఇంగ్లిష్‌లో మాత్రమే సమాచారం ఇస్తోంది. రానున్న రోజుల్లో మాతృభాషలో కూడా అందిస్తారేమో చూడాలి.

మెటా ఏఐని అడుగు



ఇన్నాళ్లు ఏదైనా సమాచారం కావాలంటే గూగుల్‌లో సెర్చ్ చేసేవాళ్లం. కానీ ఇప్పుడు వాట్సాప్‌లో వచ్చిన కొత్త ఫీచర్ మెటా ఏఐని అడుగు అంటున్నారు. అన్ని రంగాల వారికీ ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. మెటా ఏఐ అనేది ఉచిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసిస్టెంట్. మీరు ఎలాంటి ప్రశ్న అడిగినా మెటా సమాధానం ఇస్తుంది. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు మనకు ఏ సమాచారం కావాలన్నా దీని ద్వారా తెలుసుకోవచ్చు. ఈ సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చిన మెటా సీఈఓ మార్క్ జుకెర్ బర్గ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పాల్సిందే.

–డాక్టర్ మదన్‌కుమార్, కదిరి



ఏఐకి ఉజ్వల భవిష్యత్



తాజాగా వాట్సాప్ ద్వారా వచ్చిన కొత్త ఫీచర్ మెటా ఏఐని నేను ఉపయోగిస్తున్నా. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఏ సమాచారం కావాలన్నా క్షణాల్లో అందిస్తోంది. ఏఐకి మంచి ఉజ్వల భవిష్యత్ ఉంది. ఇంకా కొందరి ఫోన్లలో ఈ ఫీచర్ కన్పించడం లేదని విన్నాను. అలాంటి వారు వాట్సాప్ అప్‌డేట్ చేసుకోవడం ద్వారా మెటా ఏఐని పొందవచ్చు. అవసరం లేని వారు దీనిని డిలెట్ కూడా చేసుకోవచ్చు.

– ఎల్.రాజీవ్‌రెడ్డి, న్యాయవాది, అనంతపురం

కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట అభ్యర్థుల నిరసన



నిరసన తెలుపుతున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

అనంతపురం అర్బన్: కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకంపై సందిగ్ధతను తొలగించి వెంటనే ఉద్యోగాలు భర్తీ చేయాలని ఇప్పటికే రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థులు జి.సుదర్శన్, ఎం.మధుసూదన్ తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వం 6,100 పోస్టుల భర్తీకి సంబంధించి నిర్వహించిన రాత పరీక్షలో 95,208 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అయితే ఈ నోటిఫికేషన్‌పై రెండు కేసులు కోర్టులో ఉన్నాయన్నారు. ఈ రెండు కేసులకు సంబంధించి సుప్రీం కోర్టులో ఈ నెల 30న హియరింగ్ ఉందన్నారు. ఈ కేసు విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించి తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో అర్హత అభ్యర్థులు బి.వాసు, కె.యశ్వంత్ కుమార్, జి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: నేరాల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా జైలు సూపరింటెండెంట్ రహమాన్ తెలిపారు. నేరాలకు సంబంధించిన కొత్త చట్టాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రెడ్డిపల్లిలోని జిల్లా జైలులో జైలు సిబ్బందికి, అధికారులకు సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ చట్టాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు మాట్లాడుతూ... కొత్త చట్టాలకు సంబంధించిన పలు అంశాలపై అనుమానాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ నల్లప్ప, లీగల్ ఎయిడెడ్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ పెద్దన్న, అసిస్టెంట్ లీగల్ ఎయిడెడ్ కౌన్సిల్ అరుణ్‌చైతన్య, జైలర్లు వసంతకుమార్, నాగరాజు, అచ్చెన్నాయుడు, మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ జైలర్లు, న్యాయవాదులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఈడిగ విద్యార్థుల ప్రతిభా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో ఏటా ఈడిగ (గౌడ) ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేసే ప్రతిభా అవార్డులకు పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన జిల్లాలోని ఈడిగ (గౌడ) విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు నాగభూషణం, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, ట్రెజరర్ గోపీనాథ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 450 మార్కులు, ప్రైవేట్ పాఠశాలల్లో చదివి 500 మార్కులు, ఇంటర్ ప్రభుత్వ కళాశాలల్లో చదివి 850 మార్కులు, ప్రైవేట్ కళాశాల్లో చదివి 900 మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు. విద్యార్థుల వివరాలు 94411 44271 (అధ్యక్షుడు), 79890 38176 (ట్రెజరర్), 94405 86028 (ఉపాధ్యక్షుడు) నంబర్లకు పంపాలి. పూర్తి సమాచారానికి సైతం ఆయా నంబర్లలోనే సంప్రదించవచ్చు.

బదిలీలకు నోచుకోని ఆర్టీఏ కానిస్టేబుళ్లు



రవాణాశాఖ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: రవాణాశాఖలో కొన్ని నెలలుగా కానిస్టేబుళ్ల బదిలీలు చేపట్టకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి కానిస్టేబుళ్లకు బదిలీలు కల్పించాలనే నిబంధన ఉంది. అవినీతి, అక్రమాలను అరికట్టడంతో పాటు పారదర్శకమైన పాలన అందించేలా అనేక సంవత్సరాలుగా ఈ నిబంధన కొనసాగుతూ వస్తోంది. జిల్లాలో అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం రవాణాశాఖ కార్యాలయాలున్నాయి. రవాణాశాఖ అధికారులకు సబార్డినేట్‌గా ఒక్కో అధికారికి ఒకరు చొప్పున కానిస్టేబుళ్లను నియమిస్తుంటారు. అయితే రవాణా శాఖలో కానిస్టేబుళ్ల కొరత ఉండడంతో పోలీసుశాఖ నుంచి హోంగార్డులను డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. ఉప రవాణా కమిషనర్‌గా వీర్రాజు నియమితులైన తొలినాళ్లలో రవాణాశాఖ మొత్తం గాడిన పడుతుందని అందరూ భావించారు. పాలన సాఫీగా కొనసాగించడంపైనే దృష్టి పెట్టిన ఆయన అంతర్గత ప్రక్షాళనను పట్టించుకున్నట్లు లేదు. దీంతో అనేక నెలలుగా బదిలీలు లేకపోవడంతో యథాస్థానంలోనే కానిస్టేబుళ్లు కొనసాగుతున్నారు. ఈ విషయంపై డీటీసీ వీర్రాజును వివరణ కోరగా... కానిస్టేబుళ్ల బదిలీలపై కసరత్తు చేస్తున్నామని, త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

పీఆర్ ఎస్‌ఈగా బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న కేవీకేవీ ప్రసాద్

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ)గా కేవీకేవీ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెంట ఏఈఈ హుస్సేన్‌బాషా ఉన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వివిధ నిర్మాణ దశల్లో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మరమ్మతులు, వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి భవనాలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఏ ఒక్కరినీ ఉపేక్షించబోమన్నారు. ఎస్‌ఈ కార్యాలయం సహా డివిజన్ కార్యాలయాల్లోనూ కొందరి పని తీరుపై ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయని, అటువంటి వారు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

డయేరియాతో ఒకరి మృతి

కణేకల్లు: మండలంలోని అంబాపురం గ్రామానికి చెందిన బోయ వంద్రప్ప (71) డయేరియాతో మృతి చెందాడు. రెండ్రోజులుగా తీవ్ర విరేచనాలతో బాధపడుతున్న ఆయన బళ్లారిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీంతో అప్రమత్తమైన యర్రగుంట పీహెచ్‌సీ వైద్యాధికారులు సోమవారం అంబాపురంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ విజయకుమార్‌నాయక్, ఎంపీహెచ్‌ఈఓ తిరుపాల్‌నాయక్‌తోపాటు ఎంఎల్‌హెచ్, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి డయేరియా, జ్వరాలపై ఆరా తీశారు. అలాగే మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై రాయదుర్గం డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్, సిబ్బందితో కలసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైరల్ ఫీవర్స్, డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శింగనమల: మండలంలోని కల్లుమడి, తరిమెల, నిదనవాడ, ఉల్లికల్లు సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు... ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి, యజమానులపై కేసు నమోదు చేశారు.

దానిమ్మకు తెగులు

- సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు
- కళ్యాణదుర్గం కేవీకే శాస్త్రవేత్తలు



దానిమ్మ పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్(ఇన్‌సెట్‌లో) దానిమ్మను ఆశించిన తెగులు

కళ్యాణదుర్గం: ప్రస్తుతం దానిమ్మ పంటకు బాక్టీరియా ఆకుమచ్చ తెగులు సోకిందని, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్ల నివారణతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని కళ్యాణదుర్గం కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ రాధాకుమారి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 14,843 ఎకరాల్లో దానిమ్మ సాగులో ఉందన్నారు. దానిమ్మలో ఆకుమచ్చ తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వారు వివరించారు.

రోగ రహిత మొక్కనే ఎంచుకోవాలి

=కొత్తగా దానిమ్మ తోటలు సాగు చేయదలిచిన రైతులు రోగ రహిత మొక్కలను ఎంచుకోవాలి. మొక్కలను 4/4 మీటర్ల దూరంలో నాటుకుంటే తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. తెగుళ్లు ఆశించిన కొమ్మల భాగాలను అంగుళం కింద వరకూ కత్తిరించి కాల్చివేయాలి. కత్తిరింపు సమయంలో వాడే కత్తెర్లను 1 శాతం సోడియం హైపోక్లోరేట్ లేదా డెటాల్ లేదా స్పిరిట్‌లో ముంచాలి.

- కత్తిరింపులు పూర్తయిన వెంటనే 1 శాతం బోర్డో మిశ్రమం పిచికారీ చేయాలి. నేలపై రాలిన ఆకులు, తెగుళ్లు సోకిన కొమ్మలు, కాయలను తీసి కాల్చివేయాలి. చెట్ల పాదుల్లో బ్లీచింగ్ పౌడర్ ఎకరాకు 8–10 కిలోలు చల్లడం వల్ల రాలిన ఆకులలో ఉన్న బాక్టీరియా నశిస్తుంది. కత్తిరింపులు తర్వాత వచ్చిన చిగుర్లపై రోగ లక్షణాలు కనిపించిన వెంటనే పది లీటర్ల నీటిలో కాపర్ ఆక్సిక్లోరైడ్ 2 గ్రాములు మరియు స్ట్రెప్టోసైక్లిన్ లేదా పోషోమైసిన్ 5 గ్రాములు కలిపి పదిరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పూత సమయంలో కాపర్ ఆక్సీ క్లోరైడ్ బదులుగా లీటరు నీటికి కార్బొడిజ్ 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలి.
- పంట తర్వాత విశ్రాంతి సమయంలో కూడా మొక్కలపై 1 శాతం బోర్డో మిశ్రమం పిచికారీ చేయాలి. దీని వల్ల తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. మొక్క రోగ నిరోధక శక్తిని పెంచేందుకు సిఫార్సు చేసిన రసాయన ఎరువులతో పాటు పశువుల ఎరువులు, జీవన ఎరువులైన అసోస్పైరిల్లమ్, ఫాస్ఫరస్, పొటాష్, జీవ శిలీంద్రనాశకాలైన ట్రైకోడెర్మా, సూడో మోనాస్‌లు కలిపి వేసుకోవాలి. దీనికి తోడు లీటరు నీటికి సూక్ష్మపోషకాలైన జింక్ సల్ఫేట్ 2 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాము, మెగ్నీషియం సల్ఫేట్ 2 గ్రాములు, బోరిక్ యాసిడ్ 1 గ్రాము చెట్లపై పిచికారీ చేయాలి.

యువకుడి ఆత్మహత్య

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం తరుగువాండ్లపల్లికి చెందిన ప్రభాకర్‌రెడ్డి కుమారుడు జయప్రకాశ్ రెడ్డి (24) ఆత్మహత్య చేసుకున్నాడు. డిగ్రీ వరకు చదువుకున్న జయప్రకాశ్‌రెడ్డి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇంటి పట్టున ఖాళీగా ఉండలేక తండ్రితో పాటు పంటల సాగు చేపట్టాడు. ఈ క్రమంలో సాగు చేసిన టమాట పంటకు వైరస్ సోకి దెబ్బతింది. దీంతో మనస్తాపానికి గురైన జయప్రకాశ్‌రెడ్డి ఆదివారం రాత్రి పొలంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రూ.3.50 లక్షల నగదు అపహరణ

రాయదుర్గం టౌన్: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి రూ.3.50 లక్షల నగదు అపహరించుకెళ్లిన ఘటన రాయదుర్గంలో చోటు చేసుకుంది. వివరాలు... పట్టణంలోని జేఆర్‌ఎస్ కాలనీలో నివాసముంటున్న హుస్సేన్... ఇటుకల బట్టీ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఓ ఇంటిని విక్రయించగా వచ్చిన డబ్బును వంటగదిలోని ఓ డబ్బాలో ఉంచాడు. ఆదివారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి పై అంతస్తులో నిద్రపోయాడు. తాళం వేసిన ఇంటిని గమనించిన దుండగులు అర్ధరాత్రి దాటిన తర్వాత తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. వంట గదిలోని డబ్బాలో ఉంచిన రూ.3.50 లక్షల నగదుతో పాటు బీరువాలోని గిల్టు నగలూ అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన బాధితుడు హుస్సేన్ ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసులు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కరుణ చూపకుండా కాఠిన్యమా?

- నైట్ డ్యూటీ కొనసాగింపుపై స్టాఫ్‌నర్సుల ఆవేదన
- సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ముందు ఆందోళన



ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ రామస్వామితో ఆవేదన వ్యక్తం చేస్తున్న స్టాఫ్‌నర్సులు

అనంతపురం మెడికల్: క్షణం తీరిక లేకుండా నిద్ర మేల్కొని మరీ ఓపికతో వైద్య సేవలందించే తమపై కరుణ చూపించేది పోయి కాఠిన్యం ప్రదర్శించడమేంటని స్టాఫ్‌నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ తప్పిదం పేరిట నైట్ డ్యూటీలు పొడిగించడాన్ని నిరసిస్తూ సోమవారం సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయ ఆవరణలో బైఠాయించారు. నైట్‌డ్యూటీ చేసిన స్టాఫ్‌నర్సులు, హెడ్‌నర్సులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆందోళన కొనసాగించారు. అనంతరం డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత తదితరులతో స్టాఫ్‌నర్సులు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. నెల రోజులపాటు (రాత్రి 8 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు) విధులు నిర్వర్తించిన తమకు అదనంగా మరో పది రోజులు డ్యూటీలు చేయాలని అంటే ఎలా అని ప్రశ్నించారు. రోస్టర్ తప్పిదం సాకుతో నైట్ డ్యూటీలోని 80 మంది స్టాఫ్‌నర్సులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, స్టాఫ్‌నర్సులతో ఆర్ఎంఓ, డిప్యూటీ ఆర్ఎంఓ సమావేశమయ్యారు. స్టాఫ్‌నర్సుల విధుల రోస్టర్‌లో ఎందుకు మార్పులు చేయాల్సి వచ్చిందని నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణిని డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత నిలదీశారు. తన డ్యూటీ తాను చేశానంటూ నర్సింగ్ సూపరింటెండెంట్ కన్నీటి పర్యంతమవుతూ సమాధానం ఇచ్చారు. స్టాఫ్‌నర్సులకు మానవతాదృక్పథమే లేదంటూ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి హేళనగా మాట్లాడటంతో స్టాఫ్‌నర్సులు అసహనం వ్యక్తం చేశారు. తమ నెలవారీ నైట్ డ్యూటీ ముగిసినప్పటికీ అధికారులు తమ విన్నపాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడంతో వారు అదనపు నైట్ డ్యూటీలోకి వెళ్లాల్సి వచ్చింది.

రోస్టర్‌లో వారి జోక్యమేంటి?

ఆస్పత్రిలో దశాబ్దాలుగా స్టాఫ్‌నర్సుల విధుల రోస్టర్‌ను నర్సింగ్ సూపరింటెండెంట్ వేస్తున్నారని, ఇప్పుడు కొత్తగా రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు (ఆర్ఎంఓలు) జోక్యం చేసుకోవడం ఏంటని నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి వద్ద స్టాఫ్‌నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించి, రాష్ట్రస్థాయిలో అనంతపురం సర్వజనాస్పత్రికి గుర్తింపు తీసుకొచ్చామని గుర్తు చేశారు. రోస్టర్‌ను నర్సింగ్ సూపరింటెండెంట్‌గా మీరే వేయాలని కోరారు. హంస అసోసియేషన్ జిల్లా కన్వీనర్ చాముండేశ్వరి, స్టాఫ్‌నర్సు అసోసియేషన్ ఆర్‌బీ పద్మ, శ్రీదేవి, హెడ్‌నర్సు శ్రీదేవి, స్టాఫ్‌నర్సులు కమలాక్ష్మి బాయి, జయంతి, సరోజ, సువర్ణమ్మ, శ్రీలక్ష్మి, ఫకృన్నీసా, శోభ, స్టాఫ్‌నర్సులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురి చేయొద్దు



నాకు బాబుతో పాటు తొమ్మిది నెలల వయసు కలిగిన కూతురు ఉంది. రాత్రి వేళలో విధుల్లో ఉన్నా.. పాప ఏడ్చినప్పుడు ఇక్కడికే తీసుకొస్తున్నా. రాత్రి విధుల్లో క్షణం తీరిక ఉండదు. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తించాలంటే ఇబ్బంది అవుతుంది సార్. రోగుల ప్రాణాలను కాపాడడంలో కీలకంగా వ్యవహరించే స్టాఫ్‌నర్సుల పట్ల కరుణ చూపండి. మా విధులు మేము తప్పకుండా చేస్తాం. జాబ్‌చార్ట్‌లో లేని పనులు చేయించి ఇబ్బందులకు గురి చేయద్దు.

– సరోజమ్మ, స్టాఫ్‌నర్సు

క్లుప్తంగా

డ్యాన్స్ చాంపియన్‌షిప్ 'అనంత'దే



విజయోత్సాహంలో డ్యాన్స్ అకాడమీ చిన్నారులు

అనంతపురం కల్చరల్: జాతీయస్థాయి డ్యాన్స్ పోటీల్లో అనంతపురం నటరాజ్ డ్యాన్స్ అకాడమీ చాంపియన్‌షిప్ సాధించింది. చెన్నైలో మూడు రోజులుగా 14వ నేషనల్ డ్యాన్స్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. పది రాష్ట్రాల నుంచి వందలాదిమంది డ్యాన్సర్లు పోటీపడ్డారు. లాటిన్ డ్యాన్స్ విభాగంలో అనంతపురం జూనియర్స్, సబ్ జూనియర్స్ అద్భుత ప్రతిభను కనపరచి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. విజేతలుగా నిలవడానికి శిక్షణనిచ్చిన డ్యాన్స్ మాస్టర్ లక్ష్మీకాంత్‌ను బెస్ట్ కొరియోగ్రాఫర్ అవార్డుతో సత్కరించారు. వరుసగా రెండోసారి చాంపియన్‌షిప్ సాధించిన అనంతపురం టీమ్‌ను పలువురు డ్యాన్స్ మాస్టర్లు అభినందించారు.

పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వాలి



జేసీ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదల నేపథ్యంలో టెట్, డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రభుత్వమే ఉచితంగా శిక్షణ, స్టడీ మెటీరియల్ ఇచ్చేలా చూడాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు యువజన సంఘాల ఐక్య వేదిక నాయకులు విన్నవించారు. వేదిక కన్వీనర్, కో–కన్వీనర్లు ఎం.రామకృష్ణ, కసాపురం ఆంజనేయులు సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కరువు కారణంగా రైతు, పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులో ఉన్నాయన్నారు. ఈ వర్గాల వారు తమ పిల్లలను చదివించలేని స్థితిలో ఉన్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్ ప్రభుత్వం నుంచే అందేలా చూడాలని కోరారు.

నేడు యోగిని ఏకాదశి వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని రామనగర్ రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో మంగళవారం యోగిని ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నట్లు భావసార క్షత్రియ సమాజ్ కార్యదర్శి ఆనందరావు మహేంద్రకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు, మహామంగళ హారతి అనంతరం రుక్మిణీ పాండురంగస్వామి నిజ పాద దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన



కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

చెన్నేకొత్తపల్లి: అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రజలకు, విద్యార్థులకు చెన్నేకొత్తపల్లి పోలీసులు అవగాహన కల్పించారు. చెన్నేకొత్తపల్లిలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, టింబక్టు కలెక్టివ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య సంహిత చట్టాలను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కొత్త చట్టాల ప్రకారం ఫిర్యాదులు, సమన్ల జారీ వంటివి ఆన్‌లైన్ ద్వారా జరుగనున్నాయన్నారు.

మంత్రిని కలసిన 'హంస' సభ్యులు



మంత్రి సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న హంస అసోసియేషన్ నాయకులు

అనంతపురం మెడికల్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను హంస అసోసియేషన్ నాయకులు సోమవారం అనంతపురం ఐఎంఏ హాలులో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని కలసి వారిలో హంస అసోసియేషన్ జిల్లా కన్వీనర్లు కోకిల చాముండేశ్వరి, ఎస్.మహ్మద్ షఫీ, నాయకులు శోభారాణి, అలివేలు మంగమ్మ, గిరిధర్‌రెడ్డి, అలీఖాన్, లోకేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సాకే భాస్కర్ సేవలు అభినందనీయం



ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు సాకే భాస్కర్‌ను సన్మానిస్తున్న అధికారులు

రాప్తాడు: నాలుగున్నర దశాబ్దాలకుపైగా ఉపాధ్యాయ వృత్తిలో ఎనలేని సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు సాకే భాస్కర్ సేవలు అభినందనీయమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. మండలంలోని హంపాపురంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు సాకే భాస్కర్ పదవీ విరమణ కార్యక్రమం హెచ్ఎం చెన్నకేశవులు ఆధ్వర్యంలో సోమవారం అదే పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ విద్యాపరంగా, సామాజికపరంగా ఉత్తమ సేవలు అందించినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం భాస్కర్ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీవైఈఓ శ్రీనివాసరావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జయరామప్ప, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్, పెనుగొండ, పుట్టపర్తి ఎంఈఓలు సుధాకర్, ప్రసాద్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

'నీట్' ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: దేశ వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ ఫలితాలపై ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం రైల్వే స్టేషన్ నుంచి క్లాక్‌టవర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఇ.భూషణం, కె.భాస్కర్ మాట్లాడుతూ ఎన్టీఏ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు మొదటి ర్యాంకు రావడం, వారిలో ఎనిమిది మంది ఒకే విద్యాసంస్థ విద్యార్థులు ఉండడం అనుమానంగా ఉందన్నారు. జూన్ 14న నీట్ ఫలితాలు విడుదల చేయాల్సి ఉండగా హఠాత్తుగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు విడుదలైన రోజు ప్రకటించడం వెనుక ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకు ఎన్టీఏ ఇలా చేసిందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో పరీక్ష సజావుగా జరిగిందని, కేవలం ఆరు కేంద్రాల్లో మాత్రమే సమస్య వచ్చిందంటూ వివరణ ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. లీకేజీ, ప్యాకేజీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహర్షి, నాయకులు నాని, మహేంద్రబాబు, వీరేంద్రప్రసాద్, రాంబాబు, వినోద్, అఖండ, నిరంజన్, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు పెంచుతాం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు పెంచి మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డే నిర్వహించారు. ఐఎంఏ హాలులో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వైద్య వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వైద్యుల సహకారం అవసరమన్నారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ అభిషేక్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, ఆరోగ్యశ్రీ నిధుల విడుదల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంత్రితో పాటు కలెక్టర్ వినోద్‌కుమార్, ఏపీ ప్రభుత్వ వైద్య మండలి సభ్యులు డాక్టర్ ఎస్‌వీకే ప్రసాద్, తదితర సీనియర్ వైద్యులను ఐఎంఏ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో అన్నదానం.. రక్తదానం



రక్తదానం చేస్తున్న రమేష్‌గౌడ్ అనుచరులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్, బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ పుట్టిన రోజు వేడుకలను అభిమానులు, బీసీ సంఘాల నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అనాథ ఆశ్రమాల్లో, ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అన్నదానం చేశారు. అనంతపురంలోని దీపు బ్లడ్ బ్యాంకు, పలు ప్రాంతాల్లో యువత రక్తదానం చేశారు. యాపిల్ ఫంక్షన్ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వేడుకలకు బీసీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై భారీ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం బీసీ నాయకులు భాస్కర్ బాబు, గోవర్ధన్, లబ్బే రాఘవ తదితరులు రమేష్‌గౌడ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రమేష్‌గౌడ్ అభిమానులు సోమవారం వేకువజామున బస్టాండ్, తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆదినారాయణ గౌడ్, పిట్‌పిట్ బాషా, అనిల్, నామాల శంకర్, రామ్మోహన్ గౌడ్, రిలాక్స్ నాగరాజు, విష్ణు, కేశవ, హేమకిరణ్, కరణ్, అంకె తేజ్, హిద్దూ, బాలాజీ, హరి, హరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ సందీప్ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో అధికారులు డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సబిహా సుల్తానా మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ పరమేశ్వర స్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు: అతిసారపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అతిసారపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. సోమవారం ఆమె రాప్తాడులో వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని అతిసారకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ వరకూ స్టాప్ డయేరియా అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివ కృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్



పింఛన్ కోసం సచివాలయం వద్దకు వచ్చిన వృద్ధులు



47వ సచివాలయం వద్ద సాయంత్రం 4.30 గంటలకు పింఛన్ కోసం వచ్చిన దాదాపీర్

- నగరంలో ఐదు గంటలు అంతరాయం
- సచివాలయాల్లోనే పింఛన్ పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ సర్వర్ మొరాయింపుతో ఆలస్యమైంది. దీంతో అందరికీ ఇంటి వద్దే పింఛన్ అందజేయడం సాధ్యపడలేదు. ఎక్కువ శాతం మంది సచివాలయ కార్యాలయాల్లోనే తీసుకోవాల్సి వచ్చింది. నగరంలోని 74 సచివాలయాల పరిధిలో సోమవారం ఉదయమే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు. 7.30 గంటలకు సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఆగుతూ.. సాగుతూ అలా 12.30 గంటల వరకు అంతరాయం ఏర్పడింది. చేసేదిలేక అధికారులు సచివాలయాలకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం నుంచి సర్వర్ అందుబాటులోకి రావడంతో లబ్ధిదారులను కార్యాలయాలకే పిలిపించి పంపిణీ చేశారు. నగరంలో మొత్తం 23,3373 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి రూ.16.2 కోట్లు చెల్లించాల్సి ఉంది. కాగా 21,647 మంది పింఛన్‌దారులకు రూ.14.83 కోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పింఛన్



పింఛన్ అందిస్తున్న ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు: అర్హులైన ప్రతి లబ్ధిదారునికి తమ ప్రభుత్వంలో పింఛన్ అందిస్తామని ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరులోని బీసీ కాలనీ, భగత్ సింగ్ కాలనీ, ఎస్సీ కాలనీల్లో వారు లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథరామయ్య, నాయకులు శశాంక్, బాబా, మనోరంజన్, అక్కులన్న, దాసు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడులో...

రాప్తాడు: నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో పింఛన్‌దారులకు పెరిగిన పింఛన్‌ను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరై పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు పింఛన్ డబ్బును పంపిణీ చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం రాప్తాడులో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీటి శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వసంత బాబు, తహసీల్దార్ సీతారామ్, ఎంపీడీఓ గీతా వాణీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు: పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు వచ్చిన ఎమ్మెల్యే సునీతకు సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ వినతిపత్రం అందజేశారు. సత్యసాయి కార్మికులకు సంబంధించి వేతనాలు అందజేయాలని, భగత్‌సింగ్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, కమిటీ హాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉరుముల కళాకారులకు పింఛన్ అందజేయాలని ఉరుముల సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ కోరారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం అధికారులు, నాయకులు ప్రారంభించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ నిర్వహించారు. చెన్నేకొత్తపల్లిలో జరిగిన పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరయ్యారు. ఆమె చేతుల మీదుగా పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు.

కనగానపల్లి: అవ్వతాతలు, వికలాంగులు, వితంతువులకు సామాజిక భద్రతను కల్పించేందుకు సీఎం చంద్రబాబు పింఛన్ డబ్బును పెంపుదల చేశారన్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని మామిళ్లపల్లిలో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చిన పింఛన్‌దారులకు ఆమె పింఛన్ డబ్బులు అందజేశారు.

పెరిగిన హుండీ ఆదాయం

అనంతపురం కల్చరల్: నగరంలోని సున్నపుగేరిలో కొలువైన కోదండ రామస్వామి దేవాలయ హుండీ ఆదాయం ఈ ఏడాది పెరిగింది. సోమవారం రాత్రి ఈఓ రామాంజనేయులు, ఎండోమెంటు అనంతపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్‌లక్ష్మీ నారాయణ, ప్రధాన అర్చకులు ప్రదీప్ శర్మ తదితరుల సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది. దేవదాయ అధికారులు మాట్లాడుతూ గత సంవత్సరం రూ.53,995 ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ.88, 847 వచ్చిందని తెలిపారు.

ఉద్యోగాలు రెగ్యులర్ చేయండి

ధర్మవరం అర్బన్: ఉపాధ్యాయ ఎంపికకు కావలసిన అర్హత.. విద్యా సంబంధిత కార్యక్రమాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన తమను విద్యాశాఖ పరిధిలోకి తీసుకొచ్చి ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సీఆర్ఎంటీ)లు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ధర్మవరంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బాబ్‌జాన్ మాట్లాడుతూ సీఆర్ఎంటీలకు విద్యా సంబంధిత కార్యక్రమాల్లో 12 సంవత్సరాల అనుభవం ఉందన్నారు. విద్యాశాఖ ద్వారా నిర్వహించే అన్ని పోస్టుల భర్తీలో సీఆర్ఎంటీలకు వెయిటేజీ ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: అనంతపురం రూరల్, రాప్తాడు, బత్తలపల్లి మండలాల్లోని గంగలకుంట, ధర్మవరం పంగల్ రోడ్డు, అనంత టౌన్ షిప్, శిల్పా లేపాక్షి నగర్, ఉప్పరపల్లి, పూలకుంట, చియ్యేడు, కృష్ణమరెడ్డిపల్లి, మన్నీల, యర్రాయపల్లి, ముష్టూరు, సంజీవపురం, రాఘవంపల్లి, ఎస్కేయూ, ఎస్వీ పురం, ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి, కందుకూరు, జంగాలపల్లిలోని భారత్ గ్యాస్ వినియోగదారులకు మంగళవారం వంట గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554 286777లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

ఎర్రితాతకు ప్రత్యేక పూజలు

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో వెలసిన ఎర్రితాత ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం దగ్గర భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమాలను ఆలయ పూజారి ఎర్రిస్వామి పర్యవేక్షించారు.

నేడు నల్లలమ్మ ఆలయంలో పూజలు

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో వెలసిన నల్లలమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కాశీ విశ్వేశ్వరుడు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ పూజారి మంజునాథ్ స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



వైద్యాధికారి శివకృష్ణను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి శివకృష్ణను సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణమ్మ, వైద్య సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రజలు డాక్టర్లను ప్రత్యక్ష దైవాలుగా భావిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అంకిత భావంతో సేవలందిస్తున్నామని వైద్యాధికారి శివకృష్ణ పేర్కొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం... ప్రజలకు శాపం

- ఎర్రనేలకొట్టాల బ్రిడ్జిపై రాకపోకలు బంద్



ఎర్రనేల కొట్టాలకు వెళ్లే మార్గంలో మైనర్ బ్రిడ్జ్ మూసివేయడంతో జనం పాట్లు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. అమృత్ పథకం కింద రూ.కోటి వ్యయంతో ఎర్రనేలకొట్టాల వద్ద నిర్మించిన బ్రిడ్జిపై రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ఎర్రనేలకొట్టాలు, రాజీవ్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, నాగిరెడ్డిపల్లికి వెళ్లే ప్రజలతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా బ్రిడ్జ్ నిర్మాణ సమయంలో పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. రాజహంస అపార్ట్‌మెంట్ నుంచి వచ్చే మురుగు సక్రమంగా నడిమివంకలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇటీవల తమ స్థలంలో పైప్‌లు ఉన్నాయని స్థల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించి.. తాత్కాలికంగా రోడ్డును బ్లాక్ చేశారు. సాధ్యమైనంత త్వరగా వీటి పనులు పూర్తి చేసేలా చూడాలని ప్రజలు కమిషనర్‌ను కోరుతున్నారు.